క్లుప్తంగా

క్షీరాభిషేకం



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని లింగగిరి నుంచి జల్లి గ్రామం వరకు డబుల్ రోడ్డు వేసిన క్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మాదారపు చరణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం చరణ్ మాట్లాడారు. ఎమ్మెల్యే చొరవతో రోడ్డు సమస్య పరిష్కారం అయ్యిందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిందం కుమార్, నాయకులు మాదారపు చంద్రయ్య, మాదారపు భాస్కర్, బొమ్మనపల్లి గణేశ్, బూడిది వెంకటేశ్వర్లు, మంద సోమయ్య, చీకటి పెద్ద రాజు, సప్పిడి సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



వర్ధన్నపేట : ఈనెల 1 నుంచి 6వ తేదీ వరకు చైనాలో నిర్వహించిన అంతర్జాతీయ ఫైటో కెమికల్స్ సింపోజియంకు హాజరై పరిశోధక పత్రాన్ని సమర్పించిన వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ నేరెళ్ల శ్రీనివాస్‌ను కళాశాల ప్రిన్సిపాల్ జి.పోశయ్య, అధ్యాపకులు మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పోశయ్య మాట్లాడారు. ప్రొఫెసర్ శ్రీనివాస్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజు, కోఆర్డినేటర్ విష్ణుకుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రజిత, అధ్యాపకులు మధుసూదన్‌రెడ్డి, స్నేహలతారెడ్డి, సంపత్‌కుమార్, సుధారాణి, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పోచమ్మ బోనాలు



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద ప్రభుత్వ స్కూల్‌లో మంగళవారం ముందస్తు పోచమ్మ బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థులు పోచమ్మకు, మహంకాళమ్మ, ఎల్లమ్మలకు బోనాలు సమర్పించారు. సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గోడిశాల శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

15న కుంకుమార్చన

పర్వతగిరి : శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఈనెల 15న మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటలకు గోపూజతో పూజలు ప్రారంభమవుతాయని, 108 మంది మహిళలు కుంకుమార్చన చేస్తారని పేర్కొన్నారు. కుంకుమార్చనకు అవసరమైన సామగ్రి ఆలయంలో సమకూర్చనున్నట్లు వివరించారు. భక్తులు కొబ్బరికాయలు, పూలు, పండ్లు మాత్రమే వెంట తెచ్చుకోవాలని సూచించారు.

వృద్ధుడి గల్లంతు..?

పర్వతగిరి : మండలంలోని ఆకేరు వాగులో వృద్ధుడు గల్లంతైనట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కందిగట్ల ఉప్పలయ్య సోమవారం బర్లను మేపడానికి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. ఈ క్రమంలో ఆయన కనిపించడం లేదంటూ అతడి కుమారుడు పోలీసులకు మంగళరం ఫిర్యాదు చేశాడు. కాగా బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఉప్పలయ్య ఆచూకీ లభ్యం కాలేదు. కాగా ఆకేరు వాగు వద్ద ఉప్పలయ్య బట్టలు, చెప్పులు, గొడుగు కనిపించడంతో ఉప్పలయ్య కుమారుడు విష్ణు వెళ్లి వెతికినా ఆచూకీ లభించలేదు. ఉప్పలయ్య ఆకేరు వాగులో పడి కొట్టుకుపోయి ఉండొచ్చని తెలుస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దుర్గమ్మ గుడిలో చోరీ

రాయపర్తి : మండలంలోని మైలారంలోని దుర్గమ్మ గుడిలో దొంగలు సోమవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. గుడి తాళం పగులగొట్టి సుమారు రూ.5 వేల నగదుతోపాటు 15 తులాల వెండి ఆభరణాలను చోరీ చేశారు. ఈ ఘటన మండలంలో కలకలం రేపింది. గ్రామస్తుడు బోయిని కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఎల్లాయిగూడెం గ్రామానికి చెందిన వేముల సావిత్రి ఇంటికి తాళం వేసి ఉండగా సోమవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. సావిత్రి ఇంటికి తాళం వేసి వేముల వాడకు వెళ్లగా దొంగలు తలుపులు తొలగించి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాను పగలగొట్టి రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లారు.

నెక్కొండ : మత్తడి పోస్తున్న నెక్కొండ ఊర చెరువు



దుగ్గొండి : మత్తడి పోస్తున్న వెంకటాపురం పెద్ద చెరువు



భారీ వర్షం.. అతలాకుతలం

మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి జనజీవనం అతలాకుతలం అయ్యింది. నర్సంపేట, దుగ్గొండి, ఖానాపురం, నెక్కొండ, వర్ధన్నపేట, ఖానాపురం, రాయపర్తి, సంగెం మండలాల్లో భారీగా నీరు చేరి చెరువులు మత్తళ్లు పోశాయి. పాకాల సరస్సులో నీటిమట్టం 28.3 ఫీట్లకు చేరుకుంది. పంట పొలాలు నీట మునిగాయి. తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్లు, ఇతర పలు ప్రభుత్వ కార్యాలయాల్లో నీరు భారీగా నిలిచింది. రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సైలు రఘుపతి, నరేశ్, తదితరులు రక్షణ చర్యల్లో భాగస్వాములయ్యారు.

- సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట : కాజ్‌వే మీదుగా ప్రవహిస్తున్న వరద



సంగెం : మొండ్రాయిలో కూలిన ఇల్లు, ప్రహరీ



నర్సంపేట రూరల్ : మత్తడి పోస్తున్న మాదన్నపేట చెరువు



వర్ధన్నపేట : రెవెన్యూ కార్యాలయంలో వరదనీరు



రాయపర్తి : కొండూరు చెరువులోకి చేరిన వరద

ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు తప్పనిసరి

● ఎంపీడీఓ శంకర్‌నాయక్

పర్వతగిరి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రంలో లబ్ధిదారులు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు 400–600 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించుకోవాలని, త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి బిల్లులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రఘు, కారోబార్ మేడిశెట్టి కరుణాకర్, బొట్ల మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

పల్లె రాములుకు జాతీయ స్థాయి పురస్కారం



నర్సంపేట రూరల్ : మండలంలోని చంద్రయ్యపల్లికి చెందిన పల్లె రాములు స్టార్ ఆఫ్ తెలంగాణ జాతీయ స్థాయి పురస్కారం అందుకున్నారు. సోషల్ మీడియా వేదికగా మూడు వేలకుపైగా షార్ట్ ఫిల్మ్స్ నిర్మించి తెలంగాణ పల్లె ప్రజల జీవన విధానం, యాస భాషలతో ఆయన చేసిన కృషిని గుర్తించిన జాతీయ స్థాయి హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాములుకు జాతీయ అధ్యక్షుడు సత్యనారాయణ, స్వర్ణగిరి ఆలయ అధినేత మనేపల్లి రామారావు పురస్కారం అందజేశారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం



నినాదాలు చేస్తున్న రమేశ్, నాయకులు, విద్యార్థులు

● ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకుడు రమేశ్

నర్సంపేట : విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏఐఎస్‌ఎఫ్ ఉద్యమిస్తోందని ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు పంజాల రమేశ్ తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఆవిర్భావ వేడుకలు మంగళవారం నిర్వహించగా రమేశ్ అతిథిగా హాజరై జెండా ఎగరేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని, కార్పొరేట్ శక్తులకు పరోక్షంగా మద్దతు పలుకుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం, నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించాలని సూచించారు. పాలకులు అవలంబిస్తున్న తప్పుడు విధానాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని ఆకాంక్షించారు. ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పాలక పవన్, నాయకులు లవన్, ధర్మేంద్ర, శివకుమార్, రమ్య, లావణ్య, కిరణ్‌కుమార్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’ మెటీరియల్ పంపిణీ



గీసుకొండ : మండలంలోని వంచనగిరి మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు మండల ప్రత్యేక అధికారి సురేశ్‌కుమార్ మంగళవారం నీట్ పరీక్షల మెటీరియల్ అందజేశారు. అలాగే జేఈఈ పరీక్షల కోసం పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ యూనిఫామ్..

గీసుకొండ : స్థానిక ప్రజా గ్రంథాలయం ఆధ్వర్యంలో మండలంలోని కొమ్మాలలోని ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మోహన్‌రావు మాట్లాడారు. ప్రజా గ్రంథాలయ కమిటీని అభినందించారు. కార్యక్రమంలో ప్రజా గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల అనిల్, సాయిలి రాజేంద్రప్రసాద్, అధ్యక్షుడు మండల రాజు, ఉపాధ్యక్షుడు సతీశ్, ముఖ్యసలహాదార్లు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్, కలర్ పెన్సిళ్లు...

ఖానాపురం : మండలంలోని నాజీతండాలోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాదం రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో రూ.10 వేల విలువైన నోట్‌బుక్స్ కలర్ పెన్సిళ్లు, హ్యాండ్ రైటింగ్ పుస్తకాలు, తదితర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జేతూరామ్, ఉపాధ్యాయులు సూరయ్య, వీరన్న, క్లబ్ బాధ్యులు కోటేశ్వర్‌రావు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యంతో నిలిచిన ప్రాణం

నర్సంపేట : మండలంలోని ముత్తోజిపేటకు చెందిన బత్తుల నవీన్‌కు పట్టణంలో ఐకాన్ ఆస్పత్రి వైద్యులు మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు నిలిపారు. వివరాలిలా.. నవీన్ అర్షమొలలతో బాధపడుతూ ములుగులోని ఓ ఆస్పత్రిలో చేరగా చికిత్స విఫలమై మలద్వారం పక్కన, వరిబీజాలకు.. అక్కడి నుంచి పొట్ట కండరాల వరకు ఇన్ఫెక్షన్ సోకి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. నవీన్‌ను వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా భారీ మొత్తంలో ఖర్చు అవుతుందని చెప్పారు. దీంతో పేదరికం నేపథ్యంలో ఖర్చు లేని స్థితిలో ఉండగా నర్సంపేటలోని ఐకాన్ ఆస్పత్రి వైద్యులు సేవాభావంతో వైద్యం అందించేందుకు ముందుకొచ్చారు. మత్తు వైద్యుడు శశిధర్‌రెడ్డి సహకారంతో ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ రాజు అత్యవసర శస్త్రచికిత్స చేసి 15 రోజుల వరుస చికిత్స, పర్యవేక్షణ అనంతరం మంగళవారం ఆరోగ్యకర స్థితిలో డిశ్చార్జ్ చేశారు.



నవీన్‌ను డిశ్చార్జ్ చేస్తున్న డాక్టర్ రాజు, తదితరులు

లేబర్ కార్యాలయాన్ని వర్ధన్నపేటకు తరలించాలి

రాయపర్తి : రాయపర్తి, వర్ధన్నపేట మండలాల కార్మిక శాఖ అధికారి కార్యాలయాన్ని వెంటనే పరకాల నుంచి వర్ధన్నపేటకు తరలించాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కమిటీ సభ్యుడు గుగులోతు అరుణ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయపర్తి, వర్ధన్నపేట మండలాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు, దినసరి కూలీలు లేబర్ కార్డులు, ఇతర క్లెయిముల కోసం సుమారు 80 కిలోమీటర్ల దూరంలోని పరకాలకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. సమావేశంలో నాయకులు సురేశ్ బాబు, సంతోశ్, బాలాజీ, గణేశ్, రాంబాబు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాయ్యపేట గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లింగగిరి ఫీడర్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో నేడు (బుధవారం) సదరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ నర్సంపేట డీఈ తిరుపతి, చెన్నారావుపేట ఏఈ జోగానంద్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు. లింగగిరి ఫీడర్ పునరుద్ధరణ పనులు పూర్తయిన వెంటనే వీలైనంత త్వరలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని వివరించారు. రైతులు, గృహ, వాణిజ్య వినియోగదారులు సహకరించాలని కోరారు.

బియ్యం, సామగ్రి అందజేత



సామగ్రి అందిస్తున్న నాయకులు

రాయపర్తి : మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన బలగం బుచ్చయ్య, రాయపర్తిలో జొనగోని భిక్షపతి, పానిశ్ తండాలో కొర్ర మోహన్, కేశవాపురంలో చిలుముల ఎల్లమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి లేతాకుల మధూకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం 50 కేజీల చొప్పున బియ్యంతోపాటు నూనె, ఇతర నిత్యావసర సామగ్రి అందజేశారు. తొలుత బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమాల్లో ఫౌండేషన్ ప్రతినిధులు, నాయకులు గజవెల్లి ప్రసాద్, సంకినేని ఎల్లస్వామి, కోల సంపత్, బండెల బాలరాజు, గారె నర్సయ్య, ముద్రబోయిన సుధాకర్, చిన్నాల ఉప్పలయ్య, ఐత కుమార్, వేణు, సతీశ్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కార్యాచరణ

● మెప్మా డీపీఎం వరలక్ష్మి

గీసుకొండ: మండలంలోని మహిళల ఆర్థిక అభివృద్ధికి కార్యాచరణ చేపడుతున్నట్లు డీపీఎం వరలక్ష్మి తెలిపారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధ్వర్యంలో మండలంలోని ప్రగతి మండల సమైక్య కార్యాలయంలో అధ్యక్షురాలు గట్టు రాధిక అధ్యక్షతన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల అమలుపై మంగళవారం నిర్వహించిన సమావేశానికి వరలక్ష్మి హాజరై మాట్లాడారు. మహిళా శక్తి డెయిరీకి సంబంధించి పాల సేకరణదారులను గుర్తించడానికి ప్రక్రియ చేపట్టినట్లు ఆమె చెప్పారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా కోటి మందిని కోటీశ్వరులను చేయాలనే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పాన్ని సక్సెస్ చేసే దిశగా కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. పది సొసైటీలతో మండలం నుంచి రిజిస్ట్రేషన్ చేయడానికి ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అనంతరం మండల ప్రాజెక్ట్ మేనేజర్ ముక్కెన ఈశ్వర్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా పెరటి కోళ్ల పెంపకానికి సంబంధించి లబ్ధిదారులను గుర్తించాల్సిందిగా కోరారు. ఆరోగ్యం, విద్య సంబంధిత అంశాలతో గ్రామ సంఘాల్లో ప్రత్యేక ఏజెండాతో పని చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీఎంలు సారయ్య, శ్రీనివాస్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు శోభ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం వరలక్ష్మి

నాయకులు ప్రజల్లో ఉండి పోరాడాలి

● ఆర్‌జీపీఆర్‌ఎస్ కన్వీనర్ ఇనమల్ హాసన్

గీసుకొండ : నాయకులు ప్రజల్లో ఉండి సమస్యలపై పోరాడాలని రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ (ఆర్‌జీపీఆర్‌ఎస్) తమిళనాడు ఆఫీస్ బేరర్, నేషనల్ కన్వీనర్ ఇనమల్ హాసన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఊకల్ సమీపంలోని ఎస్‌ఎస్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన ఆర్‌జీపీఆర్‌ఎస్ జిల్లా స్థాయి టాలెంట్ హంట్ సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. నాయకత్వ లక్షణాలు పెంచడానికి, సమాజంలో ఉత్తమ నాయకుడిగా తీర్చిదిద్దడానికి ఆర్‌జీపీఆర్‌ఎస్ సంస్థ గొప్ప అవకాశం కల్పిస్తుందని చెప్పారు. రాజకీయాల్లో కార్యకర్తల స్థాయిలో ఉన్న ప్రతిఒక్కరూ నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో జాతీయ నాయకుడు సిద్దేశ్వర్‌రావు, రాష్ట్ర ఆఫీస్ బేరర్ రడం భరత్, పీసీసీ సభ్యుడు కొత్తపెల్లి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రడం శ్రావ్య, నాయకులు వీరారావు, భిక్షపతి, సాకేత్, శ్రవణ్, అనిల్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇనమల్ హాసన్

జ్వరాలను నిర్లక్ష్యం చేయొద్దు

● మండల వైద్యాధికారి రహేలా తన్వీర్

నెక్కొండ : జ్వరాలను నిర్లక్ష్యం చేయొద్దని మండల వైద్యాధికారి రహేలా తన్వీర్ కోరారు. మండలంలోని గుండ్రపల్లికి చెందిన ఐదేళ్ల మొహ్రిన్ విషజ్వరంతో మృతి చెందగా తురకకాశ కాలనీలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. తొలుత డాక్టర్ రహేలా తన్వీర్ ఆధ్వర్యంలోని వైద్యబృందం మొహ్రిన్ తల్లిదండ్రులను కలిసి మాట్లాడారు. అనంతరం వైద్యశిబిరంలో పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రహేలా మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, శుభ్రత పాటించాలని చెప్పారు. విషజ్వరాలతో ప్రాణాపాయం ఉంటుందని తెలిపారు. వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలని, ఫ్రిజ్‌లో నిల్వ చేసిన పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. దోమ కాటుతో డెంగీ, మలేరియా, బోదకాలు, తదితర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు రవిచందర్‌రెడ్డి, సరిత, తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న రహేలా తన్వీర్

సీఎంఆర్‌ఎఫ్‌తో నిరుపేదలకు సాయం



నర్సంపేట : సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న రమేశ్, తదితరులు

● కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి

నర్సంపేట : ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్)తో పేద కుటుంబాలకు సాయం అందిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటలో పలువురికి ఆయన మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. పేదలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేరి వైద్యం చేయించుకున్న వారికి సైతం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. అమీనాబాద్‌లో పార్టీ మండల అధ్యక్షుడు సిద్దన రమేశ్, చెన్నారావుపేటలో నర్సంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొరె కుమారస్వామి, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నన్నెబోయిన రమేశ్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమాల్లో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీశ్, నర్సంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ చీర అశోక్, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం : చెక్కులు అందజేస్తున్న వెంకటేశ్వర్లు, నాయకులు

బుధరావుపేటలో..

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటకు చెందిన 10 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు లింగిడి వెంకటేశ్వర్లు అందజేసి మాట్లాడారు. ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో పేదలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లగౌడ్, నాగరాజు, నర్సయ్య, ఖాదర్ పాషా, శ్రీశైలం, సమ్మయ్య, చాంద్ పాషా, శ్రీనివాస్, పులి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు నివాళి

నల్లబెల్లి : మంచిర్యాల జిల్లాలోని కన్నెపల్లి ఎంపీడీఓ తీగల శంకర్ (59) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు మంగళవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ అబిద్ అలీ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.